క్లుప్తంగా

పంట వివరాలను నమోదు చేసుకోవాలి



ధర్పల్లి: యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏవో ప్రవీణ్ కుమార్ సూచించారు. మండలంలోని ధర్పల్లి, హోన్నాజీపేట్‌లో గ్రామంలో మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి సీబీఈ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేశారు. చీడపీడల నుంచి పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు సలహాలు పాటించాలని రైతులకు సూచించారు. ఏఈవోలు లక్ష్మీ ప్రసన్న, గూగులోత్ దూల తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం నియామకం



నిజామాబాద్‌నాగారం: నగరంలో మంగళవారం జిల్లా బీసీ సంక్షేమ కమిటీని సంఘం రాష్ట్ర నాయకులు నియమించారు. జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు, రాష్ట్ర ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి రేవంత్ అధ్వర్యంలో నియామకం జరిగింది. జనరల్ సెక్రటరీగా ఎనుగందుల మురళి, జిల్లా ఉపాధ్యక్షులుగా రాయగిరి లక్ష్మి నరసింహ, లక్ష్మణరావు, సెక్రెటరీలుగా న్యాంతబాద్ రవీందర్, అంబటి శ్రీనివాస్‌గౌడ్, జమల్పూర్ రమేష్, షేక్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుధాకర్ తదితరులు నియమితులయ్యారు.

బాలికల ఆరోగ్యంపై అవగాహన సదస్సు




మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అంకం భానుప్రియ అవగాహన కల్పించారు. పౌష్టికాహారం, సమాజంలో వ్యక్తుల పట్ల ప్రవర్తించే తీరుతోపాటు పలు అంశాల గురించి తెలియజేశారు. హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు అరుణ్ కుమార్ శర్మ, శ్రీకాంత్, అంకం ఆస్పత్రి వైద్యులు భారతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకులకు సన్మానం



నిజామాబాద్ నాగారం : మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహసొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపల్ జ్యోతిని కలెక్టర్, ఎమ్మెల్యే సన్మానించారు.

కాంగ్రెస్ నాయకులకు..



ఖలీల్‌వాడి: నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ నేతలను సీపీఐ నాయకులు సన్మానించారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌లకు సీపీఐ నాయకులు సుధాకర్, ఓమయ్య, పుష్పగుచ్ఛాలు అందించి, సన్మానించారు. నాయకులు ఇమ్రాన్ అలీ, రాధాకుమార్, భాను చందర్, చక్రపాణి ఉన్నారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కొత్త పనులపై సర్పంచ్ అశోక్ అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కాలువలు తీయడం, పొలాల మధ్యలో పిల్ల కాలువలు, రహదారుల నిర్మాణం తదితర అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ విక్రమ్, ఏఎన్‌ఎం విజయ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నల్లా కనెక్షన్లపై చర్యలేవి?

- నగరంలో అనధికారికంగా 20వేలకు పైగా కుళాయిలు
- పట్టించుకోని అధికారులు
- కార్పొరేషన్ ఆదాయానికి గండి



నిజామాబాద్ నగర కార్పొరేషన్ కార్యాలయం

నిజామాబాద్‌నాగారం: నగరంలో అక్రమ కుళాయిలు లెక్కలేనన్ని ఉన్నాయి. నగర కార్పొరేషన్ పరిధిలో అధికారికంగా సుమారు 25వేలకు పైగా కుళాయి కనెక్షన్లు ఉండగా.. కనెక్షన్ ఉన్న ప్రతి ఇంటికి నెలకు రూ.100 ఫీజును అధికారులు వసూలు చేస్తున్నారు. కానీ అనధికారికంగా సుమారు 20వేల మంచి నీటి కుళాయి కనెక్షన్‌లు ఉండగా, ప్రతి నెల రూ. 20లక్షలకు పైగా నష్టం జరుగుతుంది. అయినా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తు చోద్యం చూస్తున్నారు. ఫలితంగా మున్సిపల్ ఆదాయానికి గండిపడుతూనే ఉంది.

ఇదీ పరిస్థితి..

నిజామాబాద్ నగరంలో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. 95వేల నివాసాలు, 4లక్షల జనాభా ఉంది. వీటి పరిధిలో అధికారికంగా 25వేల మంచినీటి కుళాయి కనెక్షన్‌లున్నాయి. ఒక్కో నీటి కుళాయికి నెలకు రూ.100చొప్పున బిల్లు కట్టాలి. కొంతమంది 6నెలలకు, మరికొంతమంది ఏడాదికి, ఇంకొందురు నెలకు నల్ల బిల్లు చెల్లిస్తున్నారు. అధికారికంగా ఉన్న 25వేల నీటి కుళాయిలకు రూ. 25లక్షలు వసూళ్లు అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

జోన్–3, జోన్–5లోనే అధికం..

నగరంలో అనధికారికంగా 20వేలకు పైగా నల్ల కుళాయిలు ఉన్నట్లు సమాచారం. ఈ లెక్కనా ఒక్కో నల్ల కుళాయికి రూ. 100 చొప్పున ప్రతి నెల 20లక్షలకు పైగా వసూళ్లు కావాల్సి ఉంటుంది. ముఖ్యంగా జోన్–3,జోన్–5లోనే అనధికారికంగా కుళాయి కనెక్షన్లు ఎక్కువగా ఉన్నట్లు ఇంజనీరింగ్ సెక్షన్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఆయా జోన్‌లల్లో కిందిస్థాయిలో పనిచేసే సిబ్బంది చేతివాటం ప్రదర్శించి అనధికారికంగా ఉన్న కుళాయిల లెక్కను చూపించడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో గత కొన్ని సంవత్సరాలుగా కిందిస్థాయిలో పని చేసే సిబ్బంది, తమ పైఅధికారులకు ముడుపులు అందించి మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టి, జేబులు నింపుకుంటున్నారని చర్చించుకుంటున్నారు.

కమిషనర్ దృష్టిపెడితేనే...

ఇంజనీరింగ్ సెక్షన్‌లో ఐదుగురు ఏఈలు, ముగ్గురు ఏడీఈ, ఈఈ, ఎస్‌ఈలతో పాటు కుళాయి బిల్లులు వసూలు చేసే సిబ్బంది ఉన్నారు. కానీ కుళాయి బిల్లుల వసూలుకు ప్రణాళిక పాటించకపోవడంతో ప్రణాళికతో బిల్లులు సరిగా రావడం లేదు. ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో అనధికారికంగా ఉన్న నీటి కుళాయిల కనెక్షన్‌లు లెక్కలోకి రావడం లేదు. బిల్లులు వసూలు చేస్తలేరు. కమిషనర్ ప్రత్యేకంగా సమీక్షించి, డ్రైవ్ చేపట్టితే అక్రమంగా, అనధికారికంగా కుళాయిలు లెక్కలోకి రావడంతో పాటు బిల్లుల రూపంలో ఆదాయం వస్తుంది. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ మంద మకరందు ఇంజనీరింగ్‌సెక్షన్‌పై దృష్టిపెట్టాలని, నగరంలోకి అక్రమ నల్లా కనెక్షన్లను క్రమబద్ధీకరించి, కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చాలని పలువురు కోరుతున్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్‌గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏళ్లుగా సామాజిక సేవ చేయడం సంతృప్తికరంగా ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని సాయినగర్‌లో గతంలో తులసీబాయి షిండే భజరంగ్‌కు చెందిన ఇల్లు వర్షానికి కూలిపోయింది. దీంతో బాధిత కుటుంబాన్ని ధన్‌పాల్ పరామర్శించి, ఇంటిని నిర్మించి ఇస్తానని హామీనిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ధన్‌పాల్ ట్రస్ట్ ద్వారా ఇంటిని నిర్మించి మంగళవారం బాధిత కుటుంబానికి అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా ఇంటిని నిర్మించి, నీడ కల్పించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించిన ఇందూరు ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. అనంతరం తులసీబాయి షిండే భజరంగ్ మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో నాయకులు కేవలం మాటలకే పరిమితమయ్యారని, కానీ ధన్‌పాల్ సూర్యనారాయణ తన సొంత డబ్బుతో నీడను కల్పించారని, ఆయనకు జీవితకాలం రుణపడి ఉంటామన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకులు మఠం పవన్‌కుమార్, అంబదాస్, రవి పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తాం





ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న సుందరయ్య కాలనీవాసులు.. సిరికొండ మండల కాంగ్రెస్ నేతలు

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్: నియోజకవర్గంలోని నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం ఆయనను పాంగ్రా జీపీ పరిధిలోని సుందరయ్య కాలనీవాసులు కలిసి, సన్మానించారు. తమ సమస్యలను విన్నవించారు. తమకు ఇళ్లు లేకపోవడంతో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి, 2007 నుంచి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నామని, నాటి ప్రభుత్వం నివాస హక్కును కల్పించారన్నారు. కానీ సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం తమను పాంగ్ర పరిధిలో గల 441, 442, 443 సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమికి తరలిస్తామని హామీ ఇచ్చానా నేటికీ నెరవేరలేదని, వాటిని అమలు చేయాలని కోరారు. భూపతిరెడ్డి స్పందించి కలెక్టర్‌కు ఎండార్స్ చేశారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది వెంకట్రాములు, పెద్దసూరి, అహ్మద్, జులేఖ, నరేష్, భరత్, శ్యామల, గంగ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

సిరికొండ: రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మంగళవారం తాళ్లరామడుగు, పెద్దవాల్గోట్, తాటిపల్లి తదితర గ్రామాల కాంగ్రెస్ నాయకులు, ముషీర్‌నగర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. నాయకులు కుందేళ్ల శ్రీనివాస్, నర్సింగ్, బన్నాజీ, అంబర్‌సింగ్, శేఖర్‌గౌడ్, సల్మాన్, ఫారూఖ్, గణేష్, జిబ్రాన్, సంతోష్‌నాయక్, భూపతినాయక్, గజన్‌లాల్, మాన్‌సింగ్, బీక్యా, జగన్, వసంత్, రాజేందర్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి గ్రామంలో ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయరెడ్డి మేన కోడలు ప్రియాంకరెడ్డి హల్దీ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై వధువును ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు నెలకు రూ.3వేల అందించి, ఆర్థికంగా ఆదుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుమన్ మహారాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సుమన్ మహారాజ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోడ్రైవర్లకు ఉపాధి కరువవడంతో ఆర్థికంగా నష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే మహిళలకు ఉచిత ప్రయాణాన్ని సవరించాలని, తెల్లరేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే అవకాశం కల్పించాలని కోరారు. రూ.లక్ష సంపాదించే వారికి ఉచిత ప్రయాణాన్ని వర్తింపజేయవద్దన్నారు. ఆటో నడిపే కార్మికుడికి ప్రతినెల ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్‌చేశారు. నాయకులు ప్రేమ్, మహిపాల్, డాక్టర్ కొండా ఆశన్న, కిరణ్, మురళీ, మహేష్, నల్లన్న, రమేష్, ఆత్మ గౌరవ్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



జక్రాన్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బ్రహ్మానందం సూచించారు. మండలంలోని పడకల్‌లో మంగళవారం కేంద్రం ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. సర్పంచ్ పుప్పాల శ్రీనివాస్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, జీపీ కార్యదర్శి భరత్‌కుమార్, ఏపీఎం రవీందర్‌రెడ్డి, ఏపీవో రవి, ఏవో దేవిక, బీట్ ఆఫీసర్ హైందవి, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు పాల్గొన్నారు.



ఇంటి పన్నును ప్రతి ఒక్కరూ చెల్లించాలి



కేశపూర్‌లో పన్ను వసూలు చేస్తున్న అధికారులు

నిజామాబాద్ రూరల్: గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులను తప్పనిసరిగా చెల్లించాలని ఎంపీడీవో మల్లేష్, ఎంపీవో మధురిమ పేర్కొన్నారు. మండలంలోని కేశపూర్ గ్రామంలో మంగళవారం వారు ఇంటి పన్ను వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రూరల్ మండలంలో ప్రతి ఇంటి యజమాని ఇంటి పన్నులను చెల్లించి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. జీపీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ – 14, 17 నెట్‌బాల్ బాలబాలికల పోటీలకు మండలంలోని సుద్దులం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం గంగారాం మంగళవారం తెలిపారు. అండర్– 17 విభాగంలోప్రణయ్‌రెడ్డి, మధు, హరీష్, అనురెడ్డి, మహేశ్వరి, రిషికరెడ్డి, అండర్–14 విభాగంలో మనోతేజ, సామ్రాట్, విశాల్, భావన, శ్రీనిధి, నితీష ఎంపికయ్యారన్నారు. వీరంతా ఈనెల 20, 21వ తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం విద్యార్థులను సర్పంచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ రాంరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ భూమేష్, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు రాజేశ్వర్, ప్రదీప్, తిరుపతిరావ్, సాయన్న, భారతి, శ్రీదేవీ, సుమలత, రమేష్ అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: తెలంగాణ సాంఘీక సంక్షేమ పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ జిల్లా అధ్యక్షుడు నక్క రాజేంధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని ఆయన తెలిపారు. వచ్చే నెల 6లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందని ఆయన తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



నిజామాబాద్‌నాగారం: నగరంలోని అశోక్‌వీధిలో పేద కుటుంబానికి చెందిన రాచురి నర్సింలు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. అంత్యక్రియల కోసం బాధిత కుటుంబానికి శ్రీలక్ష్మీచేయూత సేవా సమితి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అధ్యక్షులు వంగల రమణాచారి, ఆలువాల లక్ష్మన్ తదితరులున్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని వెంగళరావ్‌నగర్ కాలనీలోగల ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో మంగళవారం సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్ పాల్గొని మాట్లాడారు. సూర్య స్వచ్ఛంద సంస్థ వారు వైద్య శిబిరం నిర్వహించడంతో వారిని అభినందించారు. సంస్థ ప్రతినిధులు రాజేంద్ర కుమార్, విక్రం, ప్రశాంత్, వినోద్, ఆప్తాలిక్ శ్రీకాంత్, ప్రవళిక, సౌజన్య, అక్షయ, హెచ్‌ఎం భూమయ్య, ముక్తార్ పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: నకిలీ ధ్రువపత్రాలు సమర్పించిన టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృపాల్‌సింగ్‌ఠాకూర్ ప్రకటనలో డిమాండ్ చేశాడు. 111మంది టీచర్లలో 19మంది నకిలీ వైద్య ధ్రువపత్రాలు సమర్పించినట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారన్నారు. వెంటనే సదరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయులకు సత్కారం



నిజామాబాద్ రూరల్: మండలంలోని సారంగపూర్ పాఠశాలలో ముగ్గురు అధ్యాపకులు సత్యనారాయణ, జ్యోతిర్మయి, ధరంవీర్ బదిలీ అయ్యారు. ఈసందర్భంగా మంగళవారం సదరు ఉపాధ్యాయులను పాఠశాలలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా అయ్యప్ప పడిపూజ



సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామంలో మంగళవారం రఘురాంరెడ్డి కన్నెస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా రంగురంగుల పుష్పాలతో స్వామివారి మండపాన్ని అందంగా అలంకరించి, ఉత్సవమూర్తులకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మాలధారులకు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేసిన స్వామికి సన్మానం..

సిరికొండ మండలంలోని కొండూర్ గ్రామానికి చెందిన ఘణపురం నవీన్ అనే అయ్యప్ప మాలధారుడు గ్రామం నుంచి శబరిమల క్షేత్రం వరకు పాదయాత్రగా వెళ్లాడు. ఈసందర్భంగా మంగళవారం ఆయనను గ్రామంలో అయ్యప్ప స్వాములు సన్మానించారు. స్వాములు నందు, భాస్కర్, ప్రభాకర్, శ్రీనివాస్ కులకర్ణి, రఘురాంరెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

బిగ్‌బాస్ విజేతను కలిసిన రైతులు



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీ డైరెక్టర్లు మంగళవారం సిద్దిపేటలో బిగ్ బాస్ సీజన్–7 విన్నర్ పల్లవి ప్రశాంత్‌ను కలిశారు. రైతుబిడ్డ అయిన పల్లవి ప్రశాంత్ బిగ్‌బాస్ షోలో గెలిచిన ప్రైజ్‌మనీతో రైతులకు చేయూతనందిస్తానని ఇదివరకు ప్రకటించారు. దీంతో పెర్కిట్ రైతులు పల్లవి ప్రశాంత్‌ను కలిసి అభినందించారు. ప్రశాంత్‌ను కలిసిన వారిలో పెర్కిట్ సొసైటీ డైరెక్టర్ మూడ అశోక్, మానేటి నికేతన్, నద్దుకుడ నాగరాజు తదితరులున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

బాల్కొండ: జాతీయ రహదారిల వెంబడి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ ట్రాఫిక్ సీఐ చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రం శివారులో పాతజాతీయ రహదారిపై డేంజర్ జోన్‌ను పరిశీలించారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని సిబ్బందికి సూచించారు. ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి, సిబ్బంది తదితరులున్నారు.

మంచిప్ప వీడీసీ ఎన్నిక

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోవూరు నరేష్, రైటర్‌గా కెతావత్ దేవిదాస్, సభ్యులుగా నిమ్మల చంద్రారెడ్డి, శ్రీనివాస్, సాయిరెడ్డి, నర్సయ్య, సందీప్, బెల్దార్ సాయిలు, పల్నాటి సాయిలు, సంజీవ్, శ్రీకాంత్, అజీమ్, రాజు, వెంకటి, తదితరులు ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ జగదీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	40	60
బెండకాయ	70	100	పచ్చిమిర్చి	50	75
బీరకాయ	70	100	దోసకాయ	20	40
దొండకాయ	45	75	ఆలుగడ్డ	16	35
బీర్నీసుకాయ	50	80	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	40	60
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	40	60	కరివేపాకు	60	80
మెంతికూర	70	100	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	50	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,450	వెండి (కిలో)	76,600
22 క్యారెట్స్	57,580		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	యానిమల్(తెలుగు)-12.00 యానిమల్ (హిందీ)-3.45, 10.30 పిండం(తెలుగు) 7.30
స్క్రీన్-3	పిండం(తెలుగు) 10.30, 4.30 హాయ్ నాన్న- 1.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	యానిమల్(తెలుగు)-11.05, 6.20 హాయ్ నాన్న (తెలుగు)-3.05, 10.20
స్క్రీన్-2	యానిమల్(హిందీ)-10.00,6.00, 10.00 యానిమల్(తెలుగు)-2.00
స్క్రీన్-3	తికమకతండా (తెలుగు)-1.10 సామ్ బహదూర్ (ఇంగ్లీష్)- 3.40 ఎక్స్‌ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)-6.50 పిండం(తెలుగు)-10.10
స్క్రీన్-4	లాంగ్‌లైవ్(తెలుగు)-10.20 సామ్ బహదూర్(హిందీ)-1.10 7.20 జోరుగా హుషారుగా (తెలుగు)- 4.20 కలశ (తెలుగు)-10.30
దేవి	హాయ్ నాన్న(తెలుగు)
నటరాజ్	యానిమల్(హిందీ)
లలితామహల్	యానిమల్(తెలుగు)
విజయ్	ఎక్స్‌ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)